మంగళవారం తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో పార్టీ నేతలు బడుగుల లింగయ్యయాదవ్, దేవీప్రసాద్ తదితరులు

మూసీని మురికికూపం చేసిందే కాంగ్రెస్

- **తెలంగాణలో సకల దరిద్రాలకు ఆ పార్టీయే కారణం**
- **ఢిల్లీకి మూటలు పంపేందుకే మూసీ సుందరీకరణ**
- **మూసీ, చెరువులపై బహిరంగ చర్చకు సిద్ధమా?**
- **మూసీ సుందరీకరణ, ప్రక్షాళన మాకు అప్పగించండి**
- **16 వేల కోట్లతోనే చేసి చూపిస్తం: జగదీశ్‌రెడ్డి సవాల్**

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో 1956 నుంచి 2014 వరకు మూసీ, చెరువులు, నాలాలు ఎలా ఉండేవి? ఎలా అయ్యాయో బహిరంగంగా చర్చించేందుకు సిద్ధమా? అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. మూసీని మురికికూపంగా మార్చిందే కాంగ్రెస్ అని, తెలంగాణలో సకల దరిద్రాలకు ఆ పార్టీయే కారణమని మండిపడ్డారు. ఢిల్లీకి డబ్బుల మూటలు మోసేందుకే లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారని విమర్శించారు. బుకాయింపుల్లో, అబద్ధాల్లో భట్టి విక్రమార్క రేవంత్‌రెడ్డిని మించిపోయాడని జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మూసీ సుందరీకరణ ఎవరి కోసమో?, దానిని ఏం చేయదలుచుకున్నారో? చెప్పాలంటూ నిలదీశారు. సీఎం చెప్పిన మాటలు కూడా డిప్యూటీ సీఎంకు తెలియడం లేదని, లక్షా 50 వేల కోట్లు అని స్వయంగా సీఎం చెప్పారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు తమ కార్యాలయాలను నిర్మించాయని, వాటిలో కొన్ని ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని, ఆ ప్రాజెక్టులను కూలగొట్టే దమ్ము ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు ఉన్నదా అని జగదీశ్‌రెడ్డి సవాల్ చేశారు. మూసీతో లక్ష కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని, ఇప్పటికే వెయ్యి కోట్ల విలువైన పేదల ఇండ్లను కూల్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మీ కడుపు నింపుకొనేందుకు మూసీ ప్రాజెక్టు, డబ్బుల కోసం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను నాశనం చేస్తున్నారు' అని మండిపడ్డారు. డబ్బుల సంపాదనలో భట్టి సీఎంతో పోటీ పడుతున్నారని ఆరోపించారు. 'మీ వద్ద మూసీ ప్రణాళిక ఉన్నదా? మూసీ మురికిగా మారడానికి పాత బాసులు, కొత్త బాసులు కారణం కాదా?' అంటూ నిలదీశారు.

మాకు అప్పగించండి చేసి చూపిస్తాం..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ మహమ్మారికి కారణం కాంగ్రెస్ కాదా? అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. ఫ్లోరోసిస్‌ను రూపుమాపింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు మూసీని మురికి కూపంగా మార్చితే ప్రక్షాళనకు 16 వేల కోట్లతో బీఆర్‌ఎస్ పనులు ప్రారంభించిందని, ఇప్పటికైనా మూసీ సుందరీకరణ, ప్రక్షాళన పనులను దమ్ముంటే తమకు అప్పగించాలని, రూ.16వేల కోట్లతోనే పూర్తిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హిమాయత్‌సాగర్‌కు నీళ్లు తీసుకొచ్చే కార్యక్రమానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారని, ఈ పని పూర్తిచేసేందుకు కాంగ్రెస్‌కు చేతకాకుంటే చేసేందుకు తాము రెడీగా ఉన్నామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు నిధుల్లేవు కానీ, మూసీకి లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని నిలదీశారు.

తెలంగాణ భవన్ అంటే ప్రజలకు ధైర్యం

తెలంగాణ భవన్ అంటే తెలంగాణ ప్రజలకు ఓ ధైర్యమని, ఆత్మగౌరవానికి ప్రతీక అని కేసీఆర్ ఏనాడో చెప్పారని, మూసీ రివర్ ఫ్రంట్, హైడ్రా బాధితులు తెలంగాణ భవన్‌కు తండోపతండాలుగా రావడం కేసీఆర్ మాటలను రుజువు చేసిందని జగదీశ్‌రెడ్డి చెప్పారు. 'సోషల్ మీడియా వాళ్లను చూసి భయపడుతున్న రేవంత్‌రెడ్డికి కేసీఆర్ కావాల్నా? మా కార్యకర్త చాలు' అంటూ ఎద్దేవాచేశారు. కర్ణాటక, తెలంగాణలో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని హర్యానా ప్రజలు గ్రహించి కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ బీ లింగయ్య యాదవ్, బీఆర్‌ఎస్ నేతలు జీ దేవీప్రసాద్, ఓ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కళ తప్పిన హైదరాబాద్

రేవంత్ తొందరపాటు నిర్ణయాల వల్ల కుదేలైన రియల్ రంగం

- **సీఎం భాష కట్టు తప్పింది.. పాలన అదుపుతప్పింది**
- **తెలంగాణ బతుకు బండి పట్టాలు తప్పింది**
- **ఏ వర్గం సంతోషంగా లేదు**
- **కాంగ్రెస్ మోసాలపై గ్రామాల్లో చర్చ పెట్టాలి: హరీశ్‌రావు**

> గ్రామ పంచాయతీలు కళ తప్పినయ్. బతుకమ్మ, దసరా పండుగలకు బుగ్గలు వేసేందుకు కూడా పైసల్లేవ్. పంచాయతీల్లో డబ్బుల్లేక కార్యదర్శులు అప్పుల పాలైండ్రు. చిన్న కాంట్రాక్టర్లు బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నరు. ఎవరిని కదిలించినా కండ్లల్లో నీళ్లు పెట్టుకుంటున్నరు.
> \- హరీశ్

సిద్దిపేట, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి తొందరపాటు నిర్ణయాలు, చర్యల వల్ల హైదరాబాద్ కళ తప్పిందని, రియల్ ఎస్టేట్ కుదేలైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం భాష కట్టు తప్పిందని, పరిపాలన గాడి తప్పిందని, అవినీతి అదుపు తప్పిందని, మొత్తంగా తెలంగాణ బతుకు బండి పట్టాలు తప్పిందని వాపోయారు. సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం చిరుద్యోగుల ఉసురు పోసుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీల్లో డబ్బుల్లేక కార్యదర్శులు అప్పుల పాలవుతున్నారని, ఒక్కొక్కరు లక్ష నుంచి మూడు లక్షల దాకా అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'గ్రామాల్లో బుగ్గలు వేయకపోతే గ్రామస్థులు తిడుతున్నరు.. బుగ్గలు వేస్తే కరెంటు బిల్లులు ఎక్కువ వస్తయని ఇంట్ల కుటుంబ సభ్యులు తిడుతున్నరు' అంటూ ఆయా గ్రామాల్లో పరిస్థితిని వివరించారు. చిన్న కాంట్రాక్టర్లు బిల్లులు రాక కష్టాలు పడుతున్నారని, వారికి వెంటనే ప్రాధాన్యత క్రమంలో బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ దవాఖానల్లో మందులు కూడా లేవని మండిపడ్డారు.

> యువకులు, విద్యార్థులు గ్రామాలకు వచ్చి నాయనమ్మకు, అమ్మమ్మకు, తాతకు కాళ్లు మొక్కి తమ భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు కోసం ఓటు వేయాలని ఆరోజు అడిగిండ్రు.. ఇవ్వాళ అదే యువతకు, విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఈ కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలపై మీ గ్రామాల్లో చర్చ పెట్టండి.. మీ కుటుంబ సభ్యులకు వివరించి చెప్పండి.
> \-హరీశ్

పోలీస్ సిబ్బంది కుమిలిపోతున్నరు

ఒకటో తారీఖునే వేతనాలు ఇస్తున్నామని ప్రభుత్వం డబ్బా కొట్టుకుంటున్నదని, రాష్ట్రంలో సకాలంలో జీతాలు రాక అనేక మంది ఇబ్బంది పడుతున్నారని హరీశ్ తెలిపారు. పోలీస్ సిబ్బందికి టీఏ, సరెండర్ లీవుల డబ్బులు 10 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, బయటకు చెప్పుకోలేక వారు కుమిలిపోతున్నారని చెప్పారు. ప్రతి నెలా హోం గార్డుల వేతనాలు ఆలస్యంగా ఇస్తున్నారని, మున్సిపాలిటీ ఆర్పీలకు నాలుగు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, గ్రామ సంఘాల్లో పని చేసే వీఓలకు జీతాలు లేవని, మహిళా సంఘాల వీఓలు, ఆర్పీలకు కూడా ఈ పండుగకు జీతాలు అందలేదని వాపోయారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ హాస్టళ్లలో పనిచేసే వంటవాళ్లు, కామాటీలు కూడా వేతనాలు రాక ఏడు నెలలుగా అవస్థలు పడుతున్నారని, మధ్యాహ్న భోజన కార్మికులకు మార్చి నుంచి వేతనాలు, వంట సరుకుల డబ్బులు రావడం లేదని, రెండో ఏఎన్‌ఎంలకు కూడా జీతాల్లేవని, గాంధీ, ఉస్మానియా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బందికి మూడు నెలల నుంచి వేతనాలు అందడం లేదని చెప్పారు. పండుగ పూట కూడా ఆసరా పెన్షన్లు ఇవ్వరా? అని ప్రశ్నించారు. నాలుగు వేలు ఇస్తామని చెప్పి రెండు వేలే ఇస్తున్నారని, అవీ రెండు నెలలు బాకీ పడ్డారని విమర్శించారు. 'మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టే మీరు.. రెండు వేల పెన్షన్ ఎందుకివ్వడం లేదు? కోతలు పెట్టేది పేదల మీదేనా' అని ప్రశ్నించారు.

మోసాలపై చర్చ పెట్టండి..

కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలపై గ్రామాల్లో చర్చ పెట్టాలని దసరాకు ఇండ్లకు వచ్చే యువత, విద్యార్థులకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతకు మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తానని చెప్పి రేవంత్‌రెడ్డి మోసం చేసిండని, కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినవి తప్ప, కాంగ్రెస్ సర్కార్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, దీనిపై గ్రామాల్లో చర్చ పెట్టాలని కోరారు. నాలుగు వేల నిరుద్యోగ భృతి, రైతుబంధు వస్తున్నదా? అడగాలని, వానకాలం పంట చేతికొచ్చినా పెట్టుబడి సాయం మాత్రం చేతికి రాలేదని, రూ.15 వేలు ఇస్తామన్న రైతు భరోసా ఏమైందని, వీటన్నింటిపైనా యువత, విద్యార్థులు ఎండగట్టాలని విజ్ఞప్తిచేశారు. సమావేశంలో నాయకులు రాజనర్సు, శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి, భూపేశ్, సోంరెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

గోల్‌మాల్ గ్యారెంటీలు

'కాంగ్రెస్ గ్యారెంటీ అంటే గోల్డెన్ గ్యారెంటీ అని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడు. అది గోల్డెన్ గ్యారెంటీయా? గోల్‌మాల్ గ్యారెంటీయా?' అని హరీశ్ ఎద్దేవాచేశారు. 'గోల్డెన్ గ్యారెంటీ అంటే వంద రోజుల్లో 4వేల పెన్షన్, రూ.15 వేల రైతుబంధు, రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఇవ్వాలి కదా? మీరిచ్చిన హామీలు పూర్తి చేయాలి కదా? ఇవేవీ పూర్తి చేయకుంటే అది గోల్డెన్ గ్యారెంటీ ఎట్లయితది?' అని ప్రశ్నించారు. ఇవన్నీ గోబెల్స్.. గోల్‌మాల్ గ్యారెంటీలని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వచ్చాక బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయని, నిత్యావసరాల ధరలు బాగా పెరిగాయన్నారు. రియల్ ఎస్టేట్ రంగం ఆగమైపోయి లక్షల మంది రోడ్డు మీద పడ్డారని చెప్పారు. కాంగ్రెస్ మోస పూరిత వైఖరి, ఆ పార్టీ చేసిన మోసాలు, బాండ్ పేపర్ల మీద రాసిచ్చి, మాట తప్పిన తీరుపై గ్రామాల్లో యువత, విద్యార్థులు చర్చించాలని పిలుపునిచ్చారు.

- **కల్యాణలక్ష్మి చెక్కుల కోసం పడిగాపులు**

కల్యాణలక్ష్మి చెక్కుల కోసం వచ్చిన లబ్ధిదారులు.. సాయంత్రం వరకు వేచిచూశారు. నారాయణపేట జిల్లా మాగనూరు మండలానికి చెందిన 79 మంది లబ్ధిదారులు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల కోసం రైతువేదిక వద్దకు వచ్చారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు చెక్కులు పంపిణీ చేసేందుకు హాజరుకావాల్సిన ప్రజాప్రతినిధి రాలేదు. దీంతో అక్కడున్న వారిని నిలదీయగా.. ఇప్పుడు.. అప్పుడు వస్తారంటూ సర్ది చెప్తూ సమయం గడిపారు. ఎదురుచూసిన లబ్ధిదారులు నీరసించి ఆకలితో అలమటించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలివ్వండి

మాజీ మంత్రి టీ హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 8 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా సుమారు 13 లక్షల మంది విద్యార్థుల జీవితాలను కాంగ్రెస్ ప్రభుత్వం అగమ్య గోచరంగా మార్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. టీసీ, ఇతర సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వడంలేదని, దీనివల్ల విద్యార్థులు విద్యాసంవత్సరం కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 19 వేల కోట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విడుదల చేసినట్టు గుర్తు చేశారు. మంగళవారం తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల దసరా, దీపావళి వేళ సిబ్బందికి జీతాలు చెల్లించలేకపోతున్నామని గోడు వెళ్లబోసుకున్నారు. భవనాల అద్దెలు చెల్లించలేక, అప్పుల వడ్డీలు కట్టలేక కళాశాలల నిర్వహణ భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణలో పోలీస్ రాజ్యం

- **సోషల్ మీడియా ప్రతినిధులపై అణచివేతలు**
- **బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పోలీస్ రాజ్యాన్ని నడుపుతున్నారని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. వ్యవస్థలన్నింటినీ తన గుప్పిట్లో పెట్టుకొని నియంతపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ యావత్తు బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ప్రతినిధులను అరెస్ట్ చేయడమే పనిగా పెట్టుకున్నట్టు కనిపిస్తున్నదని, వారేమైనా టెర్రరిస్ట్‌లా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తల కదలికలపైనా నిఘా ఎందుకని నిలదీశారు. ప్రధాన మీడియాను గుప్పిట్లో పెట్టుకొని సోషల్ మీడియాను కూడా కంట్రోల్ చేయాలన్న భ్రమలో సీఎం ఉన్నారని ఆరోపించారు. తెలంగాణ గడ్డ మీద అణిచివేత ఏ స్థాయిలో ఉంటే అంతకు రెట్టించిన వేగంతో నిరసన ఉబికివస్తుందనే విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంతటి దారుణమైన నిర్బంధాలను చూడలేదని, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా అంటే సీఎం ఎందుకు వణుకుతున్నారని ప్రశ్నించారు.

దూకుడుగా ఫార్మా పోరు!

- **నేడు పోలేపల్లి నుంచి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాదయాత్ర**
- **హాజరుకానున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి**
- **యాత్రను అడ్డుకోవడానికి కాంగ్రెస్ యత్నం**

కొడంగల్ నియోజకవర్గం హకీంపేట చౌరస్తాలో రిలే దీక్షలో పాల్గొన్న రైతులు

బొంరాస్‌పేట, అక్టోబర్ 8 : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతులు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నారు. ఇప్పటికే బాధిత గ్రామాలకు చెందిన రైతులు తహసీల్దార్ కార్యాలయ ముట్టడి, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించి తమ నిరసనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ప్రభుత్వం ఫార్మా ఏర్పాటుకే మొగ్గు చూపుతున్నది. ఇందులో భాగంగా భూ సేకరణకు నోటిఫికేషన్ కూడా జారీ చేయడంతో రైతులు భగ్గమంటున్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుని బతుకుతున్న భూములను సర్కారు లాగేసుకుంటే ఎలా బతకాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా ఫార్మా విలేజ్ ఏర్పాటు వల్ల నీటి, వాయు కాలుష్యం ఏర్పడి పంటలు పండవని, ప్రజల జీవనం దుర్భరంగా మారుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దుద్యాల మండలం హకీంపేట చౌరస్తాలో నెల రోజులుగా రైతులు రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు.

ఇప్పటికే 703.65 ఎకరాలకు నోటిఫికేషన్

ఫార్మా విలేజ్‌పై రైతుల ఆందోళనను రేవంత్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పోలేపల్లిలోని సర్వే నంబరు 67లో 130 ఎకరాలు, హకీంపేటలోని 252 సర్వే నంబరులో 366 ఎకరాలు, లగచెర్లలో 102 సర్వే నంబరులో 140 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే ప్రభుత్వ భూమి ఫార్మా విలేజ్‌కు సరిపోకపోవడంతో ప్రభుత్వ, పట్టా భూములను కలిపి మూడు గ్రామాల పరిధిలో మొత్తం 1274.25 ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. హకీంపేటలో 505.37 ఎకరాలు, పోలేపల్లిలో 130 ఎకరాలు, లగచెర్లలో 643 ఎకరాలను ఫార్మా విలేజ్ కోసం సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే లగచెర్ల గ్రామ పరిధిలోని 632.26 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాల పట్టా భూములను సేకరించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

పాదయాత్రను అడ్డుకునేందుకు కాంగ్రెస్ యత్నం

ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా పట్నం నరేందర్‌రెడ్డి చేపడుతున్న పాదయాత్రను అడ్డుకోవడానికి కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తున్నది. బుధవారం పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయానికి రావాలని కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భూములు కోల్పోతున్న రైతులకు భరోసా ఇవ్వాల్సిన అధికార పార్టీ నాయకులు ఇలా వ్యవహరించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పోలేపల్లి నుంచి పాదయాత్ర

ఫార్మా విలేజ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం పాదయాత్రకు సిద్ధమయ్యారు. దుద్యాల మండలం పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయంలో ఉదయం పూజలు చేసి అక్కడి నుంచి హకీంపేట, పులిచెర్లకుంటతండా, రోటిబండతండా, లగచెర్ల గ్రామాల మీదుగా దుద్యాల మండల కేంద్రం వరకు పాదయాత్ర చేపడతారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈ పాదయాత్రకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. పాదయాత్రకు మద్దతుగా ఫార్మా బాధిత గ్రామాల రైతులతోపాటు వివిధ మండలాల నుంచి రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొనే అవకాశం ఉన్నది.

హామీల అమలులో వైఫల్యంతోనే కాంగ్రెస్ ఓటమి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, అక్టోబరు 8 (నమస్తే తెలంగాణ) : కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో వైఫల్యంతోనే హర్యానాలో కాంగ్రెస్ ఏడు గ్యారెంటీలను ప్రజలు విశ్వసించలేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మోసం ఎప్పుడూ చెల్లదని, ప్రజలు చాలా తెలివైన వారని కొప్పుల పేర్కొన్నారు. తప్పుడు వాగ్దానాలతో ఒకసారి గెలుపొందవచ్చేమో కానీ మరోసారి గెలువలేరని, అందుకు హర్యానా ఎన్నికల ఫలితాలే నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే లాబీయింగ్, పైరవీలు, సొంత ఎజెండా, నాయకుల అభివృద్ధి అని, ప్రజల అభివృద్ధిపై దృష్టి పెట్టదని ఎద్దేవా చేశారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలా హర్యానా ప్రజలు మోసపోలేదని, కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెట్టినట్టు ఫలితాలు ఇచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ నాయకులను నిలదీసే సమయం త్వరలోనే రానున్నట్టు కొప్పుల తెలిపారు.

తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

గురుకులాల రద్దుకు సర్కారు కుట్ర

- **గురుకుల వ్యవస్థపై సీఎం, డిప్యూటీ సీఎంలకు అవగాహన లేదు**
- **స్కూళ్లు కోళ్ల ఫాంలు కాదు.. స్టూడెంట్స్ కోడిపిల్లలు కాదు**
- **2560మందికి 25కోట్లతో బిల్డింగ్‌ల నిర్మాణం సాధ్యమేనా?**
- **బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్**

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తేతెలంగాణ): నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకు కేసీఆర్ సర్కారు తెచ్చిన గురుకులాల రద్దుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర పన్నుతున్నదని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురుకుల వ్యవస్థపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టికి అవగాహన లేదని విమర్శించారు. అందుకే 21 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని చెబుతున్నారన్నారు. 'కేవలం రూ. 25కోట్లతో 2560 మంది విద్యార్థులకు ఒకేచోట భవనాలు ఎలా నిర్మిస్తారు? స్కూళ్లేమైనా కోళ్ల ఫారాలా? విద్యార్థులను కోడిపిల్లలనుకుంటున్నారా? అసలు మీరెప్పుడైనా గురుకుల విద్యార్థుల వద్దకు వెళ్లారా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఆరు గ్యారెంటీలపై దృష్టి మళ్లించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను తెరపైకి తెచ్చారని నిప్పులు చెరిగారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం సకల హంగులతో గురుకులాలను నిర్మించి అన్నివర్గాల పిల్లలకు చదువుకొనే అవకాశం కల్పించిందని చెప్పారు. కానీ కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు గురుకులాల్లో సామాజిక న్యాయం పాటించలేదని, 666 స్కూళ్లల్లో కనీస వసతులు కల్పించలేదని సీఎం రేవంత్ అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే 662 గురుకులాల్లో మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాలకు క్రేజ్ తగ్గిందన్నారు. పిల్లలకు రగ్గులు, టీచర్లకు జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉన్నదని దుయ్యబట్టారు. ఈ ఏడాది మెడికల్, ఐఐటీ సీట్లు సాధించిన 160మంది విద్యార్థులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు విజయ్, నరేందర్ ఉన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీకి బ్రేక్

- **మొదట ఆరు జిల్లాల్లో పంపిణీకి నిర్ణయం**
- **ఆడబిడ్డల ఆగ్రహం తప్పదని వెనక్కి తగ్గిన ప్రభుత్వం**
- **పండుగ పూట మహిళలకు నిరాశే**

ములుగు, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఆరు జిల్లాల మహిళా సంఘాలు, గిరిజనులకు బతుకమ్మ చీరల పంపిణీకి బ్రేక్ పడింది. ఈ నెల 6న ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, కొమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాల మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర చేనేత సహకార సంఘం నుంచి చీరలను సరఫరా చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల కోడ్‌తో చీరల పంపిణీ ఆగిపోయింది. సంఘం వద్ద మిగిలి ఉన్న బతుకమ్మ చీరలకు అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫొటోలు ఉండగా వాటి పేరుమార్చి తెలంగాణ ఆడపడుచుల చీరల పంపిణీ పథకం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఫొటోలతో స్టిక్కర్లు అంటించి ఆయా జిల్లాలకు చేరవేశారు. ఈ నెల 7న మహిళా సంఘాల వీవో గ్రూప్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు, గిరిజన ఆడబిడ్డలకు పంపిణీని ప్రారంభించారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన చీరలే ఇప్పుడు ఇచ్చారని, వాటికి వీటికి ఎలాంటి తేడా లేదని, పేరు, ఫొటోలు మార్చి ఇవ్వడం ఏమిటని మహిళలు గుసగుసలాడినట్టు తెలిసింది. పండుగ వేళ అందరికీ ఇవ్వకుండా కొందరికే ఇస్తున్నారని పంపిణీ కేంద్రాల వద్ద బాహాటంగానే వ్యతిరేకత వచ్చినట్టు సమాచారం. కేవలం ఆరు జిల్లాల్లోనే చీరల పంపిణీ చేపట్టగా మిగతా 27 జిల్లాల ఆడబిడ్డలకు ఇవ్వకుంటే వారి నుంచి ఆగ్రహం తప్పదని భావించిన ప్రభుత్వం అప్పటికప్పుడు పంపిణీని నిలిపివేయాలని రాష్ట్ర చేనేత సహకార సంఘం ఎండీ శైలజ రామయ్యార్ ఉత్తర్వులు జారీచేసి కలెక్టర్లకు పంపించారు. అప్రమత్తమైన కలెక్టర్లు ఉత్తర్వుల కాపీని పంచాయతీ కార్యదర్శులు, అధికారులకు పంపించి చీరల పంపిణీని నిలిపివేయించారు. బతుకమ్మ పండుగ తర్వాత ఈ నెల 15 నుంచి చీరల పంపిణీని చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మొత్తానికి అధికారుల అనాలోచిత నిర్ణయాలతో బతుకమ్మ పండుగకు ఎంపిక చేసిన ఆరు జిల్లాల్లోని మహిళలతోపాటు ఇతర జిల్లాల్లోని మహిళలకు తీవ్ర నిరాశ ఎదురైందని పలువురు చర్చించుకుంటున్నారు.

ములుగు జిల్లా ములుగు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిల్వ చేసిన బతుకమ్మ చీరెలు



సీఎం రేవంత్‌రెడ్డిపై ఆదిలాబాద్ డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

రుణమాఫీ విషయంలో రేవంత్ చీటింగ్

2 లక్షల వరకు మాఫీ విషయంలో దగా.. పోలీసులకు జోగు రామన్న ఫిర్యాదు

ఆదిలాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు మాజీ మంత్రి జోగు రామన్న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డికి ఫిర్యాదు పత్రం అందజేశారు. రుణమాఫీ విషయంలో సీఎం అబద్ధాలు ఆడుతున్నారని, రైతులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. 'బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షల రుణం తీసుకోండి.. మేము అధికారంలోకి రాగానే డిసెంబరు 9న మాఫీ చేస్తాం' అని చెప్పిన రేవంత్‌రెడ్డి ఆ తరువాత మాట మార్చినట్టు ఆరోపించారు. సీఎం రేవంత్ సోమవారం ప్రధాని నరేంద్రమోదీకి రాసిన లేఖలో 7 అక్టోబర్ 2024 నాటికి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ మూడు దశల్లో పూర్తిస్థాయిలో అమలు చేశామని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉన్నదని అన్నారు.